పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ



లాలాపేట: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి రక్షణ కిట్లను పంపిణీ చేశారు. విధి నిర్వాహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ డిప్యూటీ మేయర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రైల్వే జీఎంకు పలువురి అభినందన



సికింద్రాబాద్: దక్షిణమధ్య రైల్వే జీఎంగా అదనపు బాధ్యతలు చేపట్టిన సౌత్‌కోస్ట్‌రైల్వే జీఎం సందీప్‌కుమార్ మాథూర్‌ను శుక్రవారం కలిసిన మజ్దూర్ యూఏనియన్ నాయకులు అభినందనలు తెలిపారు. మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు నేతృత్వంలో పలువురు యూనియన్ నాయకులు సందీప్‌కుమార్ మాథూర్‌ను కలిసి ఇక్కడి పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ పలు కార్మిక సమస్యలను జీఎం దృష్టికి తెచ్చామన్నారు. మజ్దూర్ యూనియన్ నాయకులు కాల్వ శ్రీనివాస్, మురళీధర్, సరోజినీరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ ఆరోగ్యం కోసం సర్వమత ప్రార్థనలు




సికింద్రాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని కోరుతూ సీతాఫల్‌మండిలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం సర్వమత ప్రార్థనలు చేశారు. స్థానిక నాయకుడు జీ చంద్రశేఖర్ నేతృత్వంలో టీఆర్‌టీ క్వార్టర్స్‌లోని ఉప్పలమ్మ గుడి, చిలకలగూడ మసీదు, నామాలగుండులోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నవీన్‌కుమార్‌చారి, రవికుమార్, బాలాజీ, సద్దాంహుస్సేన్, అజ్గర్‌అలీ, జియా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన శ్మశాన వాటిక కమిటీ సభ్యులు



అడ్డగుట్ట: సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను సత్యహరిశ్చంద్ర స్మశాన వాటిక నూతన కమిటీ సభ్యులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ శ్మశాన వాటికలో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసి అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్మశాన వాటిక కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


సత్యనారాయణ

అడ్డగుట్ట: తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి తెలిపిన మేరకు.. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన కాముని సత్యనారాయణ(50) వృత్తిరిత్యా ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 1న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు వారికి తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మానసికస్థితి సరిగాలేని మహిళ అదృశ్యం


ఎల్లమ్మ

అడ్డగుట: మానసికస్థితి సరిగా లేని ఓ మహిళ అదృశ్యమైంది. తుకారాంగేట్ పోలీసులు తెలిపిన మేరకు.... అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన ఎల్లమ్మ(40) గత నెల 29న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబసభ్యులు ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబుల్..ట్రబుల్

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లల్లో రాజ్యమేలుతున్న సమస్యలు

- సమస్యల సుడి గుండంలో బండమైసమ్మనగర్ బస్తీ
- పని చేయని లిఫ్టులు..విద్యుత్ సమస్యలు
- పట్టించుకోని అధికార గణం


బండమైసమ్మనగర్ బస్తీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ బస్తీలో ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఇక్కడి ప్రజలు నిత్యం సమస్యలతో సహవాసం చేస్తున్నారు. బండమైసమ్మనగర్ బస్తీలో సుమారు 400 పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎన్నో సంవత్సరాల నుంచి పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనలు, విజ్ఞప్తుల నేపథ్యంలో 2017లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి 2022లో పూర్తి చేసి వారికి కేటాయించారు. అయితే ఇళ్లు ఇచ్చారనే సంతోషం కంటే ఇక్కడ సమస్యలు స్థానికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి.

- బండమైసమ్మనగర్ బస్తీలో ఏ,బీ,సీ,డీ,ఈ 5 బ్లాక్‌లలో సుమారు 400 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.
- మూడేళ్లుగా లిఫ్టులు పనిచేయడం లేదు. ఇక్కడి ప్రజలకు నాలుగు, అయిదు, ఆరు అంతస్తుల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టారు. పై అంతస్తుల్లోకి వెళ్లడం ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఏళ్ల తరబడి నుంచి లిఫ్టులు లేకుండా పైకి వెళుతూ నరకం చూస్తున్నారు.
- అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ సమయంలో పలువురు తమ ఇండ్లను నిర్మాణాల కోసం ఇచ్చారు. అయితే క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది బాధ్యతారాహిత్యం వల్ల అనేక మందికి ఇళ్ల అలాట్‌మెంట్ కాలేదు. ఇప్పటి వరకు కూడా బాధిత కుటుంబాలు సికింద్రాబాద్ రెవెన్యూ కార్యాలయం చుట్టు చెక్కర్లు కొడుతున్నారు.
- నాసిరకం నిర్మాణాల కారణంగా అనేక బ్లాక్‌లతో పెచ్చులూడుతున్నాయి. ఫ్లోరింగ్ ఊడిపోవడం... మెట్లు కుంగిపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించడం కష్టతరంగా తయారైయింది.
- విద్యుత్‌లోఓల్టేజీ, నీటి ఎద్దడి కారణంగా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు.
- వీధుల్లో చెత్తాచెదారం వ్యర్థాలతో ఈ ప్రాంతం దుర్గంధంగా మారింది.
- ఇటీవల స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బండమైసమ్మ నగర్ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు స్థానికులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. అందరూ కలిసి కమిటీని ఏర్పాటు చేసుకొని తన వద్దకు వస్తే సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానికులకు సూచించారు.
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్వాహణ ఖర్చుల కోసం గాను ఇక్కడ మడిగెల నిర్మాణం చేపట్టారు. వాటిని ఇంత వరకూ ఎవరికీ కేటాయించలేదు. ఇప్పటికైనా రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పదవులకు వన్నె తెచ్చిన గొప్పనాయకుడు రోశయ్య

ఎమ్మెల్యే తలసాని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట : పదవులకు వన్నె యకుడు నేత కొణిజేటి రోశయ్య అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రోశయ్య 92వ జయంతిని అమీర్‌పేట ప్రకృతి ఆసుపత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, శాసనమండలి సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా పనిచేసి ప్రజలకు విశేషమైన సేవలు అందించారని గుర్తు చేశారు. అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఘనత రోశయ్యకే దక్కిందన్నారు.

కొణిజేటి రోశయ్య ప్రభుత్వ ప్రకృతి ఆసుపత్రిగా నామకరణం: ఆయుష్ డైరెక్టర్

ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.68 మేరకు ఏప్రిల్ 16న అమీర్‌పేట ప్రకృతి ఆసుపత్రికి కొణిజేటి రోశయ్య పప్రభుత్వ ప్రకృతి వైద్య ఆసుపత్రిగా మార్చినట్లు ఆయుష్ విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్‌బాబు తెలిపారు. రోశయ్య కుటుంబం ఆసుపత్రి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి,అమీర్‌పేట కార్పోరేటర్ సరళ, మాజీ కార్పోరేటర్ శేషుకుమారి, కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. (కిలో రూపాయల్లో..) టమాటా.35, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 61, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకర కాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 23, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు...

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, మైత్రీవనం, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు బేగంపేట పోస్టాఫీసు, గీతాంజలి స్కూల్, బేగంపేట రైల్వే స్టేషన్, ఓఎల్డ్‌క స్టమ్స్‌బస్తీ, పీఎఫ్ క్వార్టర్స్, బ్రాహ్మణవాడీ, వరుణ్ టవర్స్ లేన్, మాతాజీనగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదిత్యబ్లాక్, ఆదితయ వింధ్య బ్లాక్, కుమ్మరిబస్తీ, ఇమ్రోజ్ హోటల్ లేన్, ఆనంద్‌బజార్, జీన్స్ కార్నర్, కాకతీయ మెస్, డెల్టా ఛాంబర్స్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, గ్రీన్‌పార్కు, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కిటకిటలాడుతున్న పీర్ల మండపాలు


మోండా మార్కెట్ సమీపంలోని పాట్‌మార్కెట్ రోడ్డులో పీర్ల మండపం

బన్సీలాల్‌పేట్: మొహర్రం సందర్భంగా అనేక ప్రాంతాల్లో పీర్లను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని అనేక ఏరియాలు, బస్తీల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. హిందూ, ముస్లింలు తేడా లేకుండా ప్రతి ఒక్కరు పీరీల మండపాలను సందర్శించి దట్టీలను సమర్పిస్తున్నారు. మోండా మార్కెట్ డివిజన్‌లోని పాట్‌మార్కెట్, రాణిగంజ్, బోయిగూడ, బన్సీలాల్‌పేట్, శివాజీనగర్, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో ముస్లీం సంఘాల ప్రతినిధులు మొహర్రం వేడుకల కోసం ఈ నెల 6వ తేదీ ఆదివారం మొహర్రం పండుగ కోసం ముస్లింలు సర్వం సిద్ధం చేస్తున్నారు.

గణపతి దేవాలయ ట్రస్టుబోర్డు సభ్యుడికి సన్మానం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ గణపతి దేవాలయానికి నూతన ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమితులైన మాణిక్ ప్రభును మున్నూరు కాపు సభ్యులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం గణపతి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కాచిగూడ శాఖ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షులు గంప చంద్రమోహన్, ఆనంద్, మాజీ యువక మండలి అధ్యక్షులు రామ్మోహన్, బండల జితేందర్ ఈసీ మెంబర్లు, ఆఫీస్ బేరర్లు ఆయనను సత్కరించారు. అనంతరం ప్రతినిధులు గణనాథుడిని దర్శించుకోగా వారికి మర్యాదపూర్వకంగా సత్కరించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమర్థ పాలన


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ సమర్థ పాలన సాగుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న సమావేశానికి, ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. పికెట్ చౌరస్తాలో గుమిగూడిన నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతానికి కంటోన్మెంట్‌లో మాత్రమే కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉందన్నారు. రాబోయే రోజుల్లో నగరంలోని మిగతా నియోజకవర్గాల్లోనూ పార్టీ పాగా వేసేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, బద్రీనాథ్ యాదవ్, బద్దం బల్వంత్ రెడ్డి, సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులను విడుదల చేయాలి

లాలాపేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని బహుజన రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పాకాల దానియేలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఆ పథకానికి తరువాత వచ్చిన పాలకులు సకాలంలో నిధులు విడుదల చేయకుండా పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి రీయింబర్స్ మెంట్ నిధులను సకాలంలో విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలనీ కోరారు.

కేజీబీవీలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కస్తూరి బా విద్యాలయాలలో (కేజీబీవీ) నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 497 కేజీబీవీ పాఠశాలల్లో 245 స్కూల్స్ జూనియర్ కాలేజీలుగా అప్ గ్రేడ్ చేశారని తెలిపారు. కానీ నాన్ టీచింగ్ సిబ్బంది పాఠశాలలకు మాత్రమే పరిమితం అయ్యారని వివరించారు. జూనియర్ కాలేజీల్లో నాన్‌టీచింగ్ పనులను అధ్యాపకులు చేయడంతో తరగతుల బోధన, హాస్టల్స్ నిర్వహణ, నైట్ డ్యూటీలు ఇబ్బంది కరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్లు (ఎస్‌వోలు) నియంతలా వ్యవహరిస్తున్నారని లింగంగౌడ్ తెలిపారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వేల్పుకొండ వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఓయూ బీఆర్‌ఎస్వీ నేత ఏల్పుకొండ రామకృష్ణ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేష్ కేక్‌కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు రమేష్ గౌడ్, క్యాదాసు రవి పాల్గొన్నారు.

రైల్లో నుంచి జారిపడి విద్యార్థిని మృతి

నల్లగొండ: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ అభినవ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లికి చెందిన పీఎస్ రుత్విక(18) హైదరాబాద్ నుంచి శుక్రవారం సాయంత్రం చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో చెన్నైకి వెళ్తోంది. రైలు రాత్రి 7 గంటల సమయంలో నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే..రుత్విక ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతిచెందింది. రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బొడిగ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గృహనిర్బంధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిశోధన విద్యార్థి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలును పోలీసులు గృహ నిర్బంధం (హౌజ్ అరెస్ట్) చేశారు. శుక్రవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో భాగంగా ఓయూలో వివిధ విద్యార్థి సంఘాలను ముందస్తు అరెస్టులు చేశారు. అందులో భాగంగా తార్నాకలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్న తుంగ బాలును తెల్లవారు జామున ఓయూ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా తుంగబాలు రేవంత్ రెడ్డి పాలన పై మండిపడ్డారు.

వైభవంగా మహంకాళి అమ్మవారికి బోనం


పూజలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి మొదటి బోనం సమర్పించారు. ప్రతి ఏడాది బోనాల ఉత్సవాల సందర్భంగా అత్తెల్లి కుటుంబీకులు ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం బోయిగూడలోని అత్తెల్లి అరుణగౌడ్ ఇంటి దగ్గర బోనం తయారు చేశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి జోగిని శ్యామల, సింగర్ మధు ప్రియలు బోనాన్ని తీసుకుని వచ్చారు. భక్తి శ్రద్ధలతో బోనాన్ని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్లమెంటు ఇంచార్జ్ తలసాని సాయి యాదవ్, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణగౌడ్ పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళి దేవాలయానికి పోటెత్తిన భక్తజనం


శాకాంబరీగా అమ్మవారు, దేవాలయం


దేవాలయం ముందు భక్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయానికి శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ఆషాఢమాసంలో వచ్చే శుక్రవారం కావడంతో దేవాలయం భక్తులతో నిండిపోంది. అమ్మవారిని ఆలయ అధికారులు కూరగాయలతో ముస్తాబు చేశారు. గర్భాలయంతో పాటు దేవాలయం మొత్తం కూరగాయలు, ఆకు కూరలతో ముస్తాబు చేశారు. వందల మంది అమ్మవారిని దర్శించుకునేందుకు దేవాలయం వద్ద భారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమలు, బోనాలు సమర్పించారు. దేవాలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

బోనాల ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా భక్తులకు కోసం చేసే ఏర్పాట్ల కోసం వివిధ శాఖల అధికారులు కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఫైర్ తదితర అధికారులు ఎక్కడెక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఇంకా మెరుగైన సేవలు ఎలా అందించాలి అనే దానిపై దేవాలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో తిరిగి పరిశీలించారు. మహంకాళి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మెడికల్ క్యాంపు, పారిశుద్ధ్య పనులతో పాటు ఆర్‌అండ్‌బీ చేపట్టిన క్యూ లైన్ల గురించి చర్చించారు. మొబైల్ టాయిలెట్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు అనేది పరిశీలించారు. అలాగే దేవాలయంలో ఉన్న 32 సీసీ కెమెరాలతో పాటు క్యూలైన్ల ప్రవేశం, తిరిగి వచ్చే చోట అదనంగా 40 కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో పాటు పోలీస్ స్టేషన్ పరిధిలో 140 కెమెరాలను పరిశీలించి అన్ని పనిచేసేలా చూస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేష్, జలమండలి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పద్ధతిలో వైద్యవిద్యను బోధించాలి

గాంధీఆస్పత్రి: వైద్యవిద్య బోధనలో అత్యాధునిక పద్ధతులు అవలంబించి వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వైద్యనిపుణులు సూచించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని రీజనల్ ట్రెనింగ్ సెంటర్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ (బీసీఎంఈ)' మూడవ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎస్ రాజకుమారిలు ముఖ్యఅతిథులుగా హాజరై పలు అంశాలపై చర్చించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు తెలంగాణలోని 60 మెడికల్ కాలేజీలను మూడు రీజియన్స్‌గా విభజించారని, గాంధీ మెడికల్ కాలేజీ ఓ రీజనల్ కేంద్రంగా కొనసాగుతుందని, ఈ రీజియన్‌లో 26 మెడికల్ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. వైద్యవిద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు కేవలం మార్కులే ప్రామాణికం కాదని, రోగులు, రోగి సహాయకులు, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు, సిబ్బందితో కమ్యూనికేషన్ మెరుగు పర్చుకునేందుకు నూతన బోధన పద్ధతులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. గాంధీ రీజనల్ సెంటర్ కన్వీనర్ కిరణ్ మాదల, కోకన్వీనర్ సుభోద్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్స్ రవిశేఖరరావు, వాల్యా, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఆర్‌ఎంఓ–1 శేషాద్రి, సీనియర్ ఫ్యాకల్టీలు డాక్టర్ తిరుపతిరావు, ఐశ్వర్య, సృజనలతోపాటు 26 మెడికల్ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాల్స్, వైద్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు


పార్కులో బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: గ్రేటర్‌లో ఎక్కడా లేనివిధంగా సనత్‌నగర్ డివిజన్‌లో పార్కులు ఉన్నాయని, వాటన్నింటిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని పార్కులో శుక్రవారం బోర్‌వెల్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇక్కడి బోర్‌వెల్ నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి శంకుస్థాపన కూడా చేశామన్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అన్ని డివిజన్లను అభివృద్ధి పథంలో నడిపారని, సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చేసి లబ్ది చేకూర్చారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో డివిజన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కీలకమైన ప్రాజెక్టులను ప్రారంభించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, మీర్జాఖలీల్‌బేగ్, రాజు, పురుషోత్తం, రాము, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ సీట్ల కేటాయింపులో బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట బొల్లేపల్లి స్వామిగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ ఓయూ అధికారులు పీహెచ్‌డీ సీట్ల కేటాయింపులో రోస్టర్ విధానాన్ని, 29 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేయడం లేదన్నారు. బీసీ జనాభకు తగినట్టు సీట్ల మ్యాట్రిక్స్‌ను రూపొందించి విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీ ప్రొ.కుమార్‌ను కోరారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

అమీర్‌పేట: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చెసిన వ్యక్తిపై బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మహారాష్ట్రకు చెందిన రాకేష్ ఎస్ఆర్‌నగర్‌లోని ప్రైయివేటు హాస్టల్‌లో ఉండగా దుర్గాప్రసాద్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనకు కన్సల్టెన్సీ ఉందని, డబ్బులు కడితే ఉద్యోగం ఇప్పిస్తానని దుర్గాప్రసాద్ చెప్పడంతో రాకేష్ రూ.3.35 లక్షలు ఇచ్చాడు. కేరళలో ఉన్న ఓ కంపెనీ పేరుతో అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చాడు. నెల రోజుల తర్వాత కంపెనీ ద్వారా కాకుండా కన్సల్టెన్సీ ద్వారా వేతనం వేశారు. అనుమానం వచ్చి ఆరా తీయగా అపాయింట్ లెటర్ ఫేక్ అని తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.